క్లుప్తంగా

ఆలయ కార్యవర్గం ఎన్నిక

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకులలో గల శ్రీస్వయంభు లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విజయ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శంకర్, కోశాధికారిగా శ్రీనివాస్‌యాదవ్, కార్యదర్శిగా ప్రకాష్‌శెట్టి, కమిటీ సభ్యులుగా శేషిరెడ్డి, రంగారెడ్డి, కిష్టారెడ్డి, బి.సత్యారెడ్డి, సురేంద్రచారి, బాలరాజు, ఆటో రామస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయ అభివృద్ధి కోసం తమవంతు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుచ్చన్న, గ్రామస్తులు వెంకటయ్య, కావలి తిరుపతయ్య, లక్ష్మన్న ఉన్నారు.

విరాళం అందజేత

పాన్‌గల్: మండలంలోని మాధరావుపల్లి గ్రామ ఆంజనేయస్వామి ఆలయం ఎదుట నిర్మించే మండప నిర్మాణానికి పాన్‌గల్ పీహెచ్‌సీ ఏఎన్‌ఎం సుమిత్ర శుక్రవారం రూ. 5 వేలు విరాళం అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కొత్తకోట: మున్సిపాలిటీ కేంద్రంలోని 6వ వార్డు శివగార్డెన్, గాంధీనగర్ కాలనీలో శుక్రవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను బీఆర్‌ఎస్ పార్టీ మాజీ జెడ్పీటీసీ పొగాకు విశ్వేశ్వర్ ప్రారంభించారు. కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ సంధ్యా రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ ఖాజామైనోద్దిన్, మహేశ్వరి, రాములు యాదవ్, లక్ష్మన్న, తాహేర్, మైనోద్దిన్, అంజద్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి భూమిపూజ

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి శుక్రవారం పీఆర్ ఏఈ విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు విష్ణు భూమిపూజ నిర్వహించారు. రూ.20 లక్షల నిధులతో నిర్మించే ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణం పనులను నిబంధనల మేరకు నాణ్యతగా చేపట్టాలని వారు కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పరశురాం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి ట్రాక్టర్ల బ్యాటరీల చోరీలు చోటుచేసుకున్నాయి. మండలంలోని మల్కిమియాన్‌పల్లికి చెందిన కవిత, అప్పారెడ్డిపల్లికి చెందిన బర్ల చెన్నయ్య, కొత్తగొల్ల నాగేశం, జుర్రు రాములు, మామిడిమాడ పంచాయతీ ట్రాక్టర్లకు చెందిన బ్యాటరీలను గురువారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని ట్రాక్టర్ల యజమానులు తెలిపారు. కొందరు దొంగలు కారులో వచ్చి గ్రామాల్లో ప్రధాన రోడ్లకు సమీపంలో ఉన్న ఇళ్ల ముందు నిలిపి ఉంచిన మహీంద్రా ట్రాక్టర్లే లక్ష్యంగా చోరీలు జరిగాయన్నారు. దొంగతనం విషయమై మామిడిమాడ పంచాయతీ కారోబార్ మహేష్‌తో పాటు ఆయా గ్రామాల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడు తెలిపారు.

పుస్తకం తల్లిలాంటిది

పెబ్బేరు రూరల్: ప్రతి పుస్తకం తల్లిలాంటిదని.. ప్రతి విద్యార్థి చదివే అలవాటు చేసుకోవాలని ప్రముఖ కవి జనజ్వాల అన్నారు. మండలంలోని యాపర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల లైబ్రరీని శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. గాంధీ, అంబేడ్కర్‌లాంటి గొప్ప నాయకుల పుస్తకాలు చదవడంతో భావితరంలో గొప్ప నాయకుడిగా ఎదిగే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు పలుస శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఈశ్వర్‌రెడ్డి, ఇందిరమ్మ, బాలమ్మ, రమేశ్, ఆంజనేయులు, శివాని పాల్గొన్నారు.

నిర్ణీత వేతనం ఇవ్వాలి

వనపర్తి రూరల్: వచ్చే నెలలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో ఆశ కార్యకర్తలకు నిర్ణీత వేతనం రూ.18 వేలతో పాటు ఉద్యోగ భద్రత, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఇతర సమస్యల పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆశా కార్యకర్తలు జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి అక్కడే ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, ఆశ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బుచ్చమ్మ, సునీత పాల్గొని మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనమిస్తూ ఏఎన్‌ఎం కోర్సు పూర్తిచేసిన వారికి ఏఎన్‌ఎం పోస్టులో ప్రమోషన్ కల్పించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో 15 రోజుల సమ్మెకాలంలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, నాయకులు బొబ్బిలి నిక్సన్, భాగ్య, గిరిజ, దేవమ్మ, సుజాత, శ్యామల, అరుణ, మంజుల, అనిత, నారాయణమ్మ, జ్యోతి , చెన్నమ్మ పాల్గొన్నారు.




ఖిల్లాఘనపురం మండలం గట్టుకాడిపల్లిలో..


అమడబాకుల లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో..


గోపాల్‌పేట కోదండరామస్వామి ఆలయంలో..

భక్తులతో ఆలయాలు కిటకిట


కొత్తకోట శివాలయంలో..


అమరచింత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఆత్మకూర్‌లో హోమంలో పాల్గొన్న దంపతులు, భక్తులు

సాక్షి, నెట్‌వర్క్: ముక్కోటి, వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఆలయాలు శుక్రవారం ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరాలయం, చింతల హనుమాన్ ఆలయం, ఆత్మకూర్, అమరచింతలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, మల్లాపురం ఆలయం, కొత్తకోట, గోపాల్‌పేటలోని కోదండరామస్వామి ఆలయం, వెంకటగిరి ఆలయం, కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటి లింగేశ్వరస్వామి, అమడబాకులలో స్వయంభు లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం, ఖిల్లాఘనపురం మండలంలోని గట్టుకాడిపల్లి లక్ష్మీవేంకటేశ్వర స్వామి, సోళీపురం లక్ష్మీనర్సింహ యోగానందుల స్వామి ఆలయం, ఖిల్లాఘనపురం వీరన్నగుట్టపై వెలిసిన వీరభద్రుడి ఆలయం, బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయం, కేశంపేట వేణుగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకం, వైకుంఠద్వార పూజ, ఉత్తరద్వార ప్రవేశం, గణపతిపూజ, గోపూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, మహాగణపతి, నవగ్రహ మహాసుదర్శన పంచసూక్త హోమాలు నిర్వహించారు. మహాపూర్ణాహుతి, మహామంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. పూజల్లో మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, నిర్వాహకులు కుర్మన్న, డాక్టర్ మురళీ, సంతోష, వెంకటస్వామి, పావని, మదనాపురం మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్ రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి


పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

అమరచింత: పెండింగ్‌లో ఉన్న పంచాయతీ సిబ్బంది వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌కు వినతిపత్రం అందించామని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని నెలలుగా వేతనాలు లేక పంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీంతో కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో ఉన్నారని వాపోయారు. ఈమేరకు డిప్యూటీ కమిషనర్ స్పందిస్తూ సంక్రాంతి పండుగ తర్వాత పెండింగ్‌లో ఉన్న వేతనాలను పూర్తి స్థాయిలో చెల్లిస్తున్నామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరాజ్యం, రాష్ట్ర నాయకుడు మల్లయ్య పాల్గొన్నారు.

'బడుగుల పక్షాన పోరాటం కొనసాగిస్తాం'

వనపర్తి రూరల్: సమాజంలో దోపిడీ ఉన్నంత కాలం ఎర్రజెండా సజీవంగా ఉంటుందని సీపీఐ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని లక్ష్మీనరసింహ కాలనీవాసులతో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, పీడిత ప్రజల కోసం పనిచేస్తున్న సీపీఐలో చేరి ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. పోరాటం లేనిదే ఏ మార్పు జరగదన్నారు. రైతు రుణమాఫీ, ఉచిత కరెంటు, పింఛన్లు, పక్కా ఇళ్లు, పేదలకు పొలం ఇవన్నీ సీపీఐ పోరాటం వల్లే వచ్చాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎత్తం మహేష్, చందు, భూమిక, చిన్నకురుమయ్య, సునీత, ప్రవళిక, నాగమ్మ, అశోక్, మోహన్ పాల్గొన్నారు.

తాగునీటి కొరత తీర్చాలి

ఆత్మకూర్: పట్టణంలో నాలుగు రోజులకు ఒకసారి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారని వార్డు మాజీ సభ్యుడు గడ్డమీది శ్రీనివాసులు అన్నారు. ఈవిషయమై శుక్రవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. స్థానిక బీసీ కాలనీలో వారానికి ఒకసారి నీటిని వదులుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

వాల్మీకి బోయ క్యాలెండర్ ఆవిష్కరణ

కొత్తకోట రూరల్: మండలంలోని వడ్డెవాటలో వాల్మీకి బోయ నూతన సంవత్సర క్యాలెండర్‌ను వాల్మీకి బోయ ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర నాయకులు భీమన్ననాయుడు, గోకరయ్య, బీచుపల్లి నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ నాయకులు వాల్మీకి బోయలను ఓటర్లు గానే వాడుకుంటున్నారని, వారిని ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నాలు చేయడం లేదని ఆరోపించారు. వాల్మీకి బోయలకు ఎలాంటి పథకాలు లేవని, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్న వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చితే ప్రభుత్వానికి అండగా ఉంటామన్నారు. గత పాలకులు వాల్మీకులను మోసం చేసినట్టుగానే ప్రస్తుత ప్రభుత్వం వాల్మీకి బోయలను చిన్నచూపు చూస్తుందని వాపోయారు. వాల్మీకి బోయలకు కార్పొరేషన్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోలీస్ వెంకటస్వామి, మండ్ల రవి, శ్రీనివాసులు, బాల్‌రాం తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వాల్మీకి బోయ నాయకులు

యూనియన్లు బాధ్యతాయుతంగా మెలగాలి

వనపర్తి టౌన్: యూనియన్లు బాధ్యతాయుతంగా మెలిగితే ప్రజలకు ఆశించిన రీతిలో సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని వనపర్తి విద్యుత్ టెక్నికల్ డీఈ వెంకటశివరాం అన్నారు. సీఈ ఈయూ 4404 యూనియన్ నూతన క్యాలెండర్, డైరీని శుక్రవారం డీటీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్లు పరస్పర సహకారంతో ముందుకు సాగితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, యూనియన్ల మధ్య అనవసర అంశాల చర్చకు తావివ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ సర్కిల్ అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బాలప్రతాప్, కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు బలరాం, అనంతరామశర్మ, బుడ్డన్నగారి అంజి, జయరాములు, వేణుస్వామి, సాయిప్రసాద్, కిషోర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న డీటీ, యూనియన్ సభ్యులు

పాఠశాలల్లో ముగ్గుల పోటీలు


ఆత్మకూర్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు


గోపాల్‌పేటలో..


దావాజిపల్లిలో..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల్లో అర్ధ వార్షిక పరీక్షలు ముగిసి సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో శుక్రవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

■ కొత్తకోట పట్టణ కేంద్రంలోని భారతీయ విద్యా మందిర్ పాఠశాలలో విద్యార్థులు గాలి పటాలను ఎగురవేయడంతో పాటు, రంగవల్లులు, భోగి మంటలు వేసి బొమ్మలు ఆడారు. పాఠశాల కరెస్పాండెంట్ ఎ.శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

■ ఆత్మకూర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, శ్రీవాణి హైస్కూల్‌లో రంగవల్లుల పోటీలు అలరించాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈఓ కొండాపురం బాలరాజు, టీజే విశ్వేశ్వర్ బహుమతులు అందజేశారు.

■ అమరచింత మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

■ పాన్‌గల్ మండలంలోని దావాజిపల్లి యూపీఎస్ పాఠశాలల్లో హెచ్‌ఎం కురుమూర్తినాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గులు, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయురాలు పరమేశ్వరి ఆర్థిక తోడ్పాటుతో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రాధాకృష్ణ, విజయలత, శరణ్య, భాగ్యశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

■ వీపనగండ్ల మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు భోగి పండుగ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్‌మాస్టర్ సాయిలత, హెచ్‌ఎం మంజుల, ఉపాధ్యాయులు దేవాంకర్, రంజిత్‌గౌడ్, రవి, భారతి పాల్గొన్నారు.

■ వనపర్తి మండలంలోని పెద్దగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వరలక్ష్మి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి హెచ్‌ఎం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రంగస్వామి, అమర్, రవీందర్‌రెడ్డి, రాధిక, శంకర్‌నాయక్, జానకీరాము, కృష్ణుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ పెబ్బేరు మండలంలోని గుమ్మడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గ్రోమోర్ సంస్థ తరుపున విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రోమోర్ ప్రతినిధులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

■ గోపాల్‌పేట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు విశ్రాంత వృత్తివిద్య ఉపాధ్యాయురాలు మహాలక్ష్మి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయ, వెంకటమ్మ, ఉపాధ్యాయినులు రమాదేవి, షబానా, సునీత, చెన్న పద్మ తదితరులు పాల్గొన్నారు.

పండుగ సాయన్న ఆశయ సాధనకు కృషి

- అణగారిన వర్గాల కోసం జీవితం త్యాగం చేసిన వీరుడు
- విగ్రహావిష్కరణ సభలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి


పండుగ సాయన్న విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నీలం మధు

పాన్‌గల్: పండుగ సాయన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో కృషి చేయాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు నీలం మధు అన్నారు. మండలంలోని రాయినిపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాలమూరు వీరుడు పండగ సాయన్న విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూస్వాములు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన పాలమూరు వీరుడు పండుగ సాయన్నను రాబిన్ హుడ్‌గా కీర్తించబడుతున్నారని కొనియాడారు. పీడిత జీవితాల్లో వెలుగులు నింపిన సాయన్న జీవిత చరిత్ర ప్రజల హృదయాల్లో పాటలుగా నిలిచాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం దక్కుతుందన్నారు. పండుగ సాయన్న పేరును పాలమూరు యూనివర్సిటీకి పెట్టే విధంగా సీఎం దృష్టికి తీసువెళ్లాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

మహనీయుల జీవితాలు స్ఫూర్తి

జిల్లా, నియోజకవర్గం, మండల కేంద్రాల్లో పండుగ సాయన్న విగ్రహాలు ఏర్పాటుకు తన వంతు ఆర్థిక తోడ్పాటు తప్పక అందిస్తానని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీలం మధు అన్నారు. మహనీయుల జీవితాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని వాటిని స్మరించుకుంటూ భావితరాలకు తెలియపర్చాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ నాయకులు డా.పగిడాల శ్రీనివాసులు, పండుగ సాయన్న వారసులు యాదయ్య, నర్సింహ, సంఘం నాయకులు, విగ్రహ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి


అమడబాకుల శివారులో వరి పంటలను పరిశీలిస్తున్న ఏఓ జసేమిన్, ఏఈఓ రవీందర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: యాసంగి సీజన్‌లో సాగు చేసిన రైతులు తమ పంటలను తెగుళ్ల బారి నుంచి రక్షించుకునేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని ఏఓ జసేమిన్ అన్నారు. శుక్రవారం మండలంలోని అమడబాకుల శివారులో గల వరి పంటలను ఏఓతో పాటు ఏఈఓ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నాటు వేసిన వరి పంటల్లో సల్ఫైడ్ దుష్ప్రభావం, ఆకులు పసుపు రంగులో మారడంతో పాటు క్రమంగా మొక్క చనిపోవడం, సూక్ష్మధాతు లోపాలు గమనించినట్లు తెలిపారు. వరి నాటిన పదిహేను రోజుల వరకు నీరు పెట్టి తీస్తూ ఆరుతడి లాగా పారించాలన్నారు. సూక్ష్మధాతు లోపాల నివారణ కోసం జింక్ ఈడీటీఏ–12 ఒక లీటరు నీటిలో 2గ్రాములు, ఫార్ములా–4 3గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

పదో తరగతి మోడల్ పేపర్ల విడుదల


మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ అబ్దుల్‌గని

వనపర్తి విద్యావిభాగం: పదో తరగతి వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను సన్నద్ధం చేయడంలో తన వంతు పాత్రగా పెబ్బేరు మండలం వై.శాఖాపూర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మల్లికార్జున్ రూపొందించిన మోడల్ పేపర్ల బుక్‌లెట్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ గని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి మల్లికార్జున్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. డీసీఈబీ సెక్రెటరీ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయడానికి యాక్షన్ ప్లాన్ అమలవుతున్న సమయంలో వారు రూపొందించిన ఈ పుస్తకం కచ్చితంగా విద్యార్థుల గ్రేడ్‌ను పెంచుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏసీజీఈ గణేష్‌కుమార్, ఏఎంఓ మహానంది, వనపర్తి ఎంఈఓ మద్దిలేటి, హెచ్‌ఎంలు శంకరయ్య, ఉమాదేవి, సెక్టోరియల్ ఆఫీసర్ శేఖర్, డీఎస్ఓ శ్రీనివాసులు, బయో సైన్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, పద్మ, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దు


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

అమరచింత: గ్రామాల్లో పెంచుతున్న నర్సరీల్లో మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దని, ఇచ్చిన లక్ష్యం మేరకు మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని నందిమళ్ల నర్సరీని శుక్రవారం ఆయన సందర్శించి మొక్కల పెంపకంలో తీసుకుంటున్న చర్యలు గురించి పంచాయతీ కార్యదర్శి వెంకటపతిరాజు ను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి నర్సరీలో పది వేల మొక్కల చొప్పున పెంచి, వచ్చే వర్షాకాలంలో నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. మొక్కల పెంపకంలో పంచాయతీ కార్యదర్శులు అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నర్సరీల నిర్వహణపై ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు ఎప్పటి కప్పుడు నివేదికలను అందిస్తున్నారని తెలిపారు.

లక్ష్యంతో చదివితే బంగారు భవిష్యత్

అమరచింత: విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని చదివితేనే బంగారు భవిష్యత్ పొందుతారని స్ఫూర్తి మోటివేషన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పల్ల శ్రీనివాసులు అన్నారు. మండలంలోని కేజీబీవీలో విద్యార్థులకు శుక్రవారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. అనంతరం జీసీడీఓ శుభలక్ష్మి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు కేజీబీవీల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహించి వారిలో ఉత్సాహం పెంచుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, పాఠశాల ఎస్ఓ స్వప్నరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు కావాల్సిన మార్గాలను అన్వేషించాలని జీసీడీఓ శుభలక్ష్మి, మోటివేషన్ స్పీకర్ పల్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని బాలకిష్టాపూర్ కేజీబీవీ పాఠశాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

45 రోజుల్లో ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణం

ఖిల్లాఘనపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని 45 రోజుల్లో పూర్తి చేస్తామని హౌజింగ్ డీఈ విఠోభా తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ వెంకటాచారితో కలిసి నిర్మాణాన్ని పరిశీలించి మాట్లాడారు. 9 పిల్లర్లతో ఒక బెడ్‌రూం, హాల్, కిచెన్‌తో పాటు మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందించే రూ.5 లక్షలతో నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. ఇదే మోడల్‌లో గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుందని చెప్పారు.

ఉపాధ్యాయులను నియమించాలి

ఆత్మకూర్: పట్టణంలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు సతమతమవుతున్నారని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుతుబ్ అన్నారు. శుక్రవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉర్దూమీడియం ఉన్నతపాఠశాలను సందర్శించి విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల సమయం సమీపిస్తున్నా రెండు సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేక బోధనలో వెనుకబడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు యూనూస్, సమీర్, వసీం, పాష, రవి, విద్యార్థులు ఉన్నారు.

పోస్టర్ మేకింగ్ పరీక్షలు

వనపర్తి విద్యావిభాగం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వనపర్తి బాల భవన్‌లో 9వ తరగతి నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ పోటీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు శేఖర్, యుగేందర్, మహానంది, వనపర్తి ఎంఈఓ మద్దిలేటి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నివేదిత విద్యార్థికి అభినందన

కొత్తకోట: జడ్చర్ల, పోలేపల్లి సెజ్ ఎస్‌వీకేఎం పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శన కనపరిచిన కొత్తకోటలోని నివేదిత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి మణికంఠ జాతీయ సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు. అనంతరం విద్యార్థి ప్రతిభకు కారణమైన పాఠశాల సైన్సు బోధించే ఉపాధ్యాయులను పాఠశాల కరెస్పాండెంట్ ఆకుల లక్ష్మి, యాజమాన్య బృందం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.